ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025



సమస్యలను వింటున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. 40 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. డీఆర్వో సంగీత, అధికారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గాదేవి

బాలాత్రిపుర సుందరీదేవిగా..

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని ఈశ్వరాంజనేయస్వామి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం మొదటి రోజు దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కడ్తాల్ : మైసిగండిలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు

రిజర్వేషన్లపై కసరత్తు!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకోసం రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఈమేరకు చర్యలు చేపట్టింది. మంగళవారంలోగా స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేయాలని, అయితే ఈ వివరాలను రహస్యంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా అధికారులు రిజర్వేషన్ల ప్రక్రియను గోప్యంగా చేపట్టారు.

- రంగారెడ్డి జిల్లాలో 9, వికారాబాద్‌లో 8 జెడ్పీ స్థానాలు బీసీలకు రిజర్వుడు!
- స్థానిక ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం
- మొదట పరిషత్.. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు
- గోప్యంగా రిజర్వేషన్లు జాబితా రూపొందిస్తున్న అధికారులు
- బీసీలకు 42% రిజర్వేషన్లు అమలే కీలకం
- గతంలో రిజర్వేషన్లన్నీ తారుమారు
- వార్డులు, గ్రామాలు, మండలాల వారీగా ఆయా వర్గాల జనాభా గుర్తింపు
- వీటి ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు
- ఎక్కువ జనాభా శాతం ఉన్న వర్గానికి తొలుత అక్కడ రిజర్వేషన్ అమలు



ఆశావహుల్లో ఉత్కంఠ...

స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుకోవాలని ఎదురు చూస్తున్న ఆశావహుల్లో రిజర్వేషన్ల కసరత్తు దడ పుటిస్తోంది. ఏ స్థానం ఎవరికి రిజర్వు అవుతుందనే ఉత్కంఠ వారిలో కొనసాగుతోంది. రిజర్వేషన్లపై స్పష్టత వచ్చేంత వరకు ఆశావాహులకు టెన్షన్ తప్పేలా లేదు. ఇప్పటికే ఏ వర్గానికి రిజర్వేషన్ ఖరారైతే ఎవరు ఎన్నికల బరిలో ఉండాలనేది ప్రధాన రాజకీయ పార్టీల్లో కొంత వరకు అంచనా వచ్చినట్లు తెలుస్తోంది. పంచాయతీల్లో, జడ్పీటీసీ స్థానాల విషయంలో కొంత వరకు రాజకీయ నేతల్లో స్పష్టత ఉండగా, మండల పరిషత్ అధ్యక్ష పదవులపై ఇంకా ఓ అంచనాకు రాలేదని సమాచారం.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : కులగణన సర్వే ద్వారా వచ్చిన వివరాల ప్రాతిపదికన బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అలాగే ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించనున్నారు. తెలంగాణ పంచాయతీ



రాజ్ చట్టం 2018 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల్లో రిజర్వేషన్లు కల్పిస్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ రిజర్వేషన్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధి కల్పన శాఖ కమిషనర్ ఖరారు చేయనుండగా, జెడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు జిల్లా కలెక్టర్.. ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవో ఖరారు చేయనున్నారు. ఇదిలా ఉంటే బీసీ రిజర్వేషన్లపైనే ఎక్కువ ఉత్కంఠ నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తొలిసారిగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండడంతో ఆ వర్గాలు ఈ రిజర్వేషన్ ఫలాలు పొందేందుకు ఆశగా

మిగతా 7వ పేజీలో...

యూరియా కోసం ఆందోళన వద్దు

» డీఏవో ఉష



యూరియాను పరిశీలిస్తున్న డీఏవో ఉష

ఆమనగల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన వద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉష కోరారు. జిల్లావ్యాప్తంగా గత పది రోజులుగా యూరియా సరిపడా సరఫరా చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లు వ్యవసాయ డివిజన్ పరిధిలోని తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో సోమవారం పర్యటించి యూరియా సరఫరా తీరును పరిశీలించారు. ఆమనగల్లుకు 40 టన్నులు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాలకు 50 టన్నుల యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. రైతులు ఎవరూ యూరియా బస్తాలను నిల్వ చేయకూడదని, అవసరం మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. యూరియాను బ్లాక్‌చేసిన, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డీఏవో హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ శోభారాణి, ఏవో కవిత, ఏఈవోలు శ్రీకాంత్ రెడ్డి, మీనాక్షి, గాయత్రి, డీలర్లు ఉన్నారు. ఆమనగల్లులో సోమవారం యూరియా కోసం భారీ సంఖ్యలో రైతులు వచ్చారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు క్యూలో నిలబెట్టి పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు.



ఆదిభట్లలో కురుస్తున్న వర్షం

దంచికొట్టిన వాన

నీట మునిగిన పలు కాలనీలు.. చెరువులను తలపించిన రోడ్లు

నాదర్‌గుల్- ఏవియేషన్ అకాడమీలో అత్యధికంగా 99.3 మిల్లిమీటర్ల వర్షపాతం

రంగారెడ్డి అర్బన్/ఆదిభట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచింది. మోకాలి లోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హయత్‌నగర్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బంజారాకాలనీ నీట మునిగింది. నాలా ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఇళ్లలోకి వరద నీరు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి అనాజ్‌పూర్ వెళ్లే దారిలో రోడ్డుపై నుంచి వరద ప్రవహించింది. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులోని అవెన్యూ కాలనీలోకి వరద నీరు చేరింది. దీంతో కాలనీ వాసులు అవస్థలు పడ్డారు. నగర శివారులో వర్షం దంచికొట్టింది. ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. గడిచిన 24 గంటల్లో కురిసిన భారీ వర్షానికి బాలాపూర్ మండలం నాదర్‌గుల్ పరిధిలోని ఏవియేషన్ అకాడమీలో అత్యధికంగా 99.3 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో 97.0 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, హయత్‌నగర్ మండలం డిఫెన్స్ కాలనీలో 91.8 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదైంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండల తొర్రూర్ గ్రామపంచాయతీ

మిగతా 8వ పేజీలో...

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రావిర్యాలలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రావిర్యాలలో రూ.30లక్షలతో పాఠశాల భవనం, రూ.3.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రావిర్యాల గ్రామాన్ని కన్నతల్లిలా భావిస్తానన్నారు. షాద్‌నగర్ నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 28 ఇండ్లు ఈ ఒక్క గ్రామానికి ఇచ్చామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ గ్రామంలో ఒక్క అభివృద్ధి పనికూడా చేపట్టలేదని ఆరోపించారు. రావిర్యాలలో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని విద్యార్థులు చెప్పగానే నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని వివరించారు. అనంతరం చౌదరిగూడ మండల తహసీల్దార్ కార్యాలయంలో 22 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, షాద్‌నగర్ నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు పిట్ట రజిత, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్, సత్యానారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్ రెడ్డి, బాల్‌రాజ్, గోపాల్, వెంకట్‌నర్సింహారెడ్డి, అజ్జు, చంద్రబాబుగౌడ్, అధికారులు పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఈఈ శ్రీరామ్‌రాములు, వంశీకృష్ణ, తహసీల్దార్ జగదీశ్వర్, నాయబ్ తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కొందుర్గు : అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆరుగురికి కల్యాణలక్ష్మీ చెక్కులు, 19 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ ఆజంఅలీ, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, సయ్యద్ సాదిక్, గోవర్ధన్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, యాదయ్య, మల్లేష్ గౌడ్, నర్సింహాలు, కృష్ణ, రవి, నరేందర్, పాల్గొన్నారు.

ఘనంగా బహుజన బతుకమ్మ ఉత్సవాలు

● హాజరైన ప్రజాకవి విమలక్క



బతుకమ్మలతో విమలక్క, మహిళలు

మొయినాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో సోమవారం బహుజన బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి, సోమవారం రాత్రి చిలుకూరులో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో ప్రజాకవి, బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా బహుజన బతుకమ్మను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 3 వరకు ఊరూరా ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి, రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పునకు

ఐక్యంగా పోరాడుదాం

- పేదలను భూమి లేని వారిని చేయొద్దు
- పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలి
- లేకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం
- సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ



భూ బాధితులతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు కోసం ఐక్యంగా పోరాడుదామని సీపీఎం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ట్రిపుల్‌ఆర్ భూబాధితులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల మీదుగా ట్రిపుల్‌ఆర్ రింగ్‌రోడ్డు పోతుందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల వేలాది మంది పేద రైతులు భూమి లేని వారిగా మిగిలి పోతారన్నారు. సన్న, చిన్న కారు రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి రైతుల అభిప్రాయాలు తీసుకుని అలైన్‌మెంట్ ఫైనల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఉన్న కొద్ది పాటి భూముల్లో బోర్లు వెసుకున్నామని, అవి లేకుండా చేస్తే తమ పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చావనైనా చస్తాం కాని.. భూములు మాత్రం ఇవ్వమని తేల్చిచెప్పారు. అనంతరం భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డివిజన్ కార్యదర్శి రాజు, సీపీఎం నాయకులు ఈశ్వర్ నాయక్, సాయిబాబు, కుర్మయ్య, పద్మారెడ్డి, బాబు, శ్రీకాంత్, కావలి రాజు మహిళా రైతులు ఉన్నారు.


స్వయం ఉపాధి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, జైపాల్‌యాదవ్

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

కడ్తాల్, , సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ నాయకులు ఎండగట్టాలని ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. కడ్తాలలో సోమవారం వారు పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు యువకులు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో దశరథ్‌నాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, పరమేశ్, కడారి రామకృష్ణ, రమేశ్, వీరయ్య, అంజి, లచ్చిరామ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులను వెంటనే చేపట్టాలి

కందుకూరు: కొలన్‌గూడ నుంచి ఎలిమినేడు వరకు రోడ్డు అధ్వానంగా మారినా ప్రభుత్వం రిపేర్ చేయించడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. సోమవారం కొలన్‌గూడను ఆమె సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు మండలాలను కలిపే బీటీ రోడ్డుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.5కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయించడం లేదన్నారు. ఆమె పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ అనిల్‌కుమార్‌తో మాట్లాడి పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గీతేశ్వరిగణేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మన్నె జయందర్, పొట్టి ఆనంద్, బి.చంద్రశేఖర్, కార్తీక్, మస్కు బాబు, దేవీలాల్‌నాయక్, సుదర్శన్‌రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, తిరపయ్య, బీరప్ప, పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలో దసరా ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయించాలని బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను కోరారు. సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్‌లు వినతి పత్రం ఇచ్చారు. అక్టోబర్ 2న దసరా, రావణ దహనం నేపథ్యంలో జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో లైటింగ్, ఇతర వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీకాంత్‌సింగ్, చెన్నకేశవులు, రాములు, పాషా, రవిరాథోడ్ పాల్గొన్నారు.

సీఎం సహకారంతో అభివృద్ధి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పనులను నాణ్యతగా, వేగవంతంగా చేయించాలని అధికారులకు ఆదేశించారు. కల్వకుర్తి సబ్‌కోర్టు పీపీగా నియమితులైన న్యాయవాది వెంకటరణను ఎమ్మెల్యే సత్కరించారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 20ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, 50ఎకరాల్లో స్కిల్‌సెంటర్, 220కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, భట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, కొండల్‌రెడ్డి, యాదయ్యగౌడ్, పంతూనాయక్, సురేందర్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, బిచ్యానాయక్, రమేశ్, శ్రీనివాస్, యాదగిరి రెడ్డి, లక్పతినాయక్, జవహర్‌లాల్, తులసీరామ్, నరేందర్, వేణుగోపాల్, జహంగీర్‌అలీ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గూడూరు భాస్కర్‌రెడ్డి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి పత్రం ఇచ్చారు. కల్వకుర్తిలో అక్టోబరు 11న నిర్వహించే సాయిమందిర్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని సత్యసాయి సేవాట్రస్ట్ సభ్యులు, ఎమ్మెల్యే ఆహ్వాన పత్రిక అందజేశారు. సీఎంను కలిసిన వారిలో యెన్నం భూపతిరెడ్డి, భృంగిఆనంద్‌కుమార్, రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.


కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

యువత ఉపాధికి ప్రభుత్వం పెద్ద పీట

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఉపాధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాలలో ఎమ్మెల్యే పర్యటించారు. గూడూరు కమల్‌నాథ్‌రెడ్డి-కావ్య దంపతులు ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని ఎమ్మెల్యే, నాయకులు ప్రారంభించారు. ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తోందని తెలిపారు. నాయకులు బిక్యానాయక్, శారద, విశ్వజ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

కడ్తాల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రం మైసిగండి శివరామాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలీపంతూ ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. మేలుకొలుపు అనంతరం మూలవిరాట్టును పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. చండీహోమం, పారాయణాల్లో తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి-అరుణ్ దంపతులు పాల్గొన్నారు. అర్చకులు మురళీధర్‌శర్మ, భానుప్రకాశ్, అమూల్యపతి ఆధ్వర్యంలో పూజలు, హోమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బిచ్యానాయక్, బిక్య, రాఘవేందర్, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.


పూజల్లో గీతనర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి

కార్మికులకు వైద్య పరీక్షలు

పరిగి,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా సోమవారం పరిగి మునిసిపల్ కార్యాలయంలో కార్మికులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను కూడా అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ నరేష్, అధికారులు దశరథం,భాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలకు ఎన్నికలు నిర్వహించండి

కొత్తూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జిల్లా, మండల మత్స్యకారులు హైదరాబాద్‌లోని మత్స్య భవన్‌కు వెళ్లి ఫిషరీస్ రాష్ట్ర డైరెక్టర్ నిఖిల, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ప్రాథమిక, జిల్లా, రాష్ట్ర ఫెడరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే చెరువుల్లో చేపపిల్లలు పంపిణీని చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేష్, బిక్షపతి, ప్రభాకర్, శ్రీరాములు, శ్రీశైలం, రాజు, నర్సింహ, నారాయణ పాల్గొన్నారు.


నిఖిలకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యేతో తాండూరు క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాండూరు స్టోన్ మర్చంట్స్, క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ సభ్యులు, వ్యాపారులు సోమవారం హైదరాబాద్‌లో ఉన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాపరాతి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అప్పు(నయీం), అబ్దుల్ రవూఫ్, ఎంఏ సత్తార్, విజయరమణరావు, మురళీధర్ తదితరులు ఉన్నారు.

ఆశావర్కర్లపై పనిభారాన్ని తగ్గించండి

శామీర్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమపై పనిభారాన్ని తగ్గించాలని ఆశావర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి, మూడుచింతలపల్లి పీహెచ్‌సీల ఎదుట సోమవారం ఆయా మండలాల్లోని ఆశావర్కర్లు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మండల ఆశావర్కర్ల కన్వీనర్ లలిత మాట్లాడుతూ.. ఆశావర్కర్లతో ప్రభుత్వ అధికారులు ఆన్‌లైన్‌లో పనులను చేయించకూడదన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


తుర్కపల్లి పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

బతుకమ్మ సంబురాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్


శాంతినగర్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని శాంతినగర్‌లో మహిళలు నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్‌పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి సునీతా మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవీనవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని నగరేశ్వర దేవాలయంలో కన్యకా పరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో కలిసి గాజుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, అనురాధ, పరిమళ, మాజీ వైస్‌ఎంపీపీ మధులత, మహిళా సంఘం ప్రతినిధులు ప్రియాంక, సునీత, అరుణ పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యం వల్లే విద్యార్థి మృతి

- విద్యార్థి సంఘాల ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలోని సిద్దార్థ కళాశాలకు చెందిన జాదవ్ సాయితేజ మృతికి కళాశాల యాజమాన్యం కారణమని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. కళాశాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. సిద్దార్థ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న జాదవ్ సాయితేజ నారపల్లిలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం రాత్రి ఉరేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల గేటు ఎదుట కొద్దిసేపు ఆందోళన చేపట్టి కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను అక్కడి నుంచి పంపించారు. ఇదే విషయమై ప్రిన్సిపాల్ జనార్దన్‌ను వివరణ కోరగా జాదవ్ సాయితేజ మృతికి కళాశాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇతర కారణాల వల్ల సాయితేజ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అతడి మృతికి కళాశాల యాజమాన్యం ప్రగాఢ సంతాపం ప్రకటిస్తుందని తెలిపారు.



హైదరాబాద్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని కలిసిన స్టోన్, క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు

నాపరాతి వ్యాపారం అభివృద్ధికి సహకరిస్తా

» ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాండూరులో నాపరాతి వ్యాపారుల అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని రాష్ట్ర శాసన మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరు స్టోన్ మర్చంట్, క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది స్టోన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నహీం, అబ్దుల్ రవూఫ్, సత్తర్, విజయ్ రామారావు, మురళి, సయ్యద్ హబీబ్, జుబేర్‌లాల ఉన్నారు.

ఆలంపల్లికి అనంతపద్మనాభ స్వామి



ఆలంపల్లికి తరలివస్తున్న అనంతపద్మనాభ స్వామి

వికారాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలంపల్లికి తరలివచ్చారు. ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నిత్యం ఆలయ పురవీధుల్లో స్వామి వారిని వాహనసేవలపై ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దసరా రోజు రవణ దహనం వద్ద జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు అందుకున్న మరుసటి రోజు స్వామి వారు మళ్లీ అనంతగిరికి తరలివెళ్తారు. ఈ క్రమంలోనే సోమవారం అనంతగిరి నుంచి ఆలంపల్లికి రాగా రామయ్యగూడ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారంప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 158 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, ఆసరా పెన్షన్లకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో..

మేడ్చల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించి పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 95 దరఖాస్తులు వచ్చినట్లు విజయేందర్‌రెడ్డి తెలిపారు.

సొసైటీ చైర్మన్ నియామకంపై ఫిర్యాదు



జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేస్తున్న చంద్రశేఖర్

కందుకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కందుకూరు రైతు సహకార సంఘం చైర్మన్ నియామకంపై సోమవారం జిల్లా సహకార సంఘం అధికారికి పాత పాలకవర్గ సభ్యులు ఫిర్యాదు చేశారు. మాజీ చైర్మన్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 12మంది డైరక్టర్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 2020 ఫిబ్రవరిలో ఎన్నికైన తమను రాష్ట్ర ప్రభుత్వం జీవో తెచ్చి పదవుల నుంచి తొలగించిందన్నారు. కొత్తగా ఎన్నికలు నిర్వహించలేదని, తమనే మరో ఆరు నెలలు కొనసాగించేందుకు మొదట నిర్ణయించిన ప్రభుత్వం నేడు కాంగ్రెస్ పార్టీ వారికి చైర్మన్ పదవులను కట్టబెట్టడం అప్రజాస్వామ్కికమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు/డైరెక్టర్లు జి.విజయేందర్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, నర్సింహ, పర్వతాలు, జి.అంజమ్మ, వెంకటేశ్, కె.యశోద, తీగల జగదీశ్వర్‌రెడ్డి, ఆనంద్, చంద్రునాయక్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేద్దాం

బషీరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిద్దామని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి అన్నారు. బషీరాబాద్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సోమవారం పాలకవర్గంతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సిద్దమ్మ జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఆదాయం, వ్యయంపై లెక్కలు చదివి వినిపించారు. స్థానిక చైర్మన్ మాధవరెడ్డి ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏఎంసీ ఫోరం జనరల్ సెక్రటరీగా ఎన్నికైనందున పాలక వర్గం సభ్యులు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ చందర్‌నాయక్, హన్మంతు, మహేందర్‌రెడ్డి, కొప్పూరు నరేష్, అనూప్‌ప్రసాద్, నరేష్‌రథోడ్ పాల్గొన్నారు.

మరకత శివలింగానికి నారా రోహిత్ పూజలు



శంకర్‌పల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు తనయుడు, సినీహీరో రోహిత్ శంకర్‌పల్లి మండల పరిధిలోని మరకత శివాలింగాన్ని దర్శించుకున్నారు. ఆదివారం అమావాస్య సందర్భంగా రాత్రి శివాలయంలో బస చేశారు. సోమవారం ఉదయం 4 గంటలకు బ్రహ్మ ముహూర్తంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు సాయిశివ ప్రమోద్‌లు నారా రోహిత్‌ను ఘనంగా సన్మానించారు. మరకత శివుడి చిత్రపటంతోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బతుకమ్మ పాట విడుదల



బతుకమ్మ పాటను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చించల్‌పేట్ గ్రామంలో సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య 'తారాజువ్వా తంగెడు పువ్వా' అనే బతుకమ్మ పాటను విడుదల చేశారు. ఈనెల 29న నిర్వహించే సామూహిక బతుకమ్మ సంబురాల్లో భాగంగా వీడియో సాంగ్ చిత్రీకరణకు జోగు శ్యామలాదేవి, గాయని మమత రమేశ్, సీనియర్ జానపద కళాకారుడు అశోక్ మాస్టర్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కాలె జయమ్మ, మాజీ ఎంపీపీ భవాని, గేయ రచయిత, గాయకుడు అంజిలప్ప, జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై కసరత్తు!

(ఐదో పేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను అధికారులు గోప్యంగా చేస్తున్నారు. కొత్తగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న నేపథ్యంలో స్థానిక సంస్థల్లో ఈ వర్గాలకు మరింత అవకాశాలు మెరుగుపడనున్నాయి. తాజాగా చేస్తున్న రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం రంగారెడ్డి జిల్లాలో 9 జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు రిజర్వుడు కానున్నాయి. అలాగే వికారాబాద్‌లో 8 జెడ్పీటీసీ స్థానాలు ఖరారయ్యే అవకాశం ఉంది. ఈ సంఖ్యలో స్వల్ప మార్పులు కూడా జరగవచ్చు.



ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైన నేపథ్యంలో కలెక్టర్ నుంచి గ్రామ కార్యదర్శి వరకు అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధమైంది. ఎన్నికల తేదీలు ఎప్పుడు ఖరారు చేసినా నిర్వహించేందుకు వీలుగా సంసిద్ధంగా ఉండాలని, ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలు రావడంతో యంత్రాంగమంతా తమ విధుల్లో నిమగ్నమయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో విడుదలైన తర్వాత రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నట్లు చెబుతున్నారు. పంచాయతీల్లో సర్పంచ్, వార్డు స్థానాలతో పాటు జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీ చైర్‌పర్సన్ పదవులకు పరోక్షంగా ఎన్నుకోనున్నారు. ఇదిలా ఉంటే, పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారీగా ఓటర్ల జాబితాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలను మార్కింగ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభించారు. మంగళవారం వరకు ఈ ప్రక్రియ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను ఇదివరకే సిద్ధం చేయగా, పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్న విషయం విదితమే.

రిజర్వేషన్ల ఖరారు ఇలా...

స్థానిక ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో వేగం పుంజుకుంది. ఆశావహుల ఆకాంక్ష త్వరలో సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. గ్రామాల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు వీలుగా ఆదేశాలు జారీ అయ్యాయి. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించిన విషయం తెలిసిందే. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్న నేపథ్యంలో రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. తాజాగా రిజర్వేషన్ స్థానాల కేటాయింపు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో సోమవారం అధికారులంతా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్/జెడ్పీ సీఈవో/, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందితో కలెక్టర్ సమావేశమై రిజర్వేషన్ల కసరత్తు ఏవిధంగా చేపట్టాలనే విషయమై దిశా నిర్దేశం చేశారు. ఏఏ ప్రాంతాల్లో ఏఏ వర్గాలు ఎక్కువగా ఉన్నాయనేది గుర్తిస్తున్నారు. వీటి ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు తెలిసింది. ఉదాహరణకు జిల్లాలో అత్యధికంగా బీసీలు ఉన్న గ్రామాల జాబితాను తయారు చేస్తున్నారు. ఎక్కువ బీసీ జనాభా శాతం ఉన్న గ్రామాలకు తొలుత బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలు కూడా ఇదే విధంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించిన తర్వాత మిగిలిన స్థానాలను జనరల్, అన్ రిజర్వుడ్‌గా గుర్తించనున్నారు. దీంతో గతంలో ఉన్న రిజర్వేషన్లన్నీ కూడా తారుమారుకానున్నాయి.

బీసీ రిజర్వేషన్ల సంఖ్య ఇలా ఉండే అవకాశం

ఆయా స్థానాలు	సంఖ్య	బీసీలకు రిజర్వుడయ్యే స్థానాలు (సుమారు)
రంగారెడ్డి జిల్లాలో		
జెడ్పీటీసీ	21	9
ఎంపీపీ	21	9
ఎంపీటీసీ	230	97
సర్పంచ్	526	221
వార్డు సభ్యులు	4668	1961
వికారాబాద్ జిల్లాలో		
జెడ్పీటీసీ	20	8
ఎంపీపీ	20	8
ఎంపీటీసీ	227	95
సర్పంచ్	594	249
వార్డు సభ్యులు	5058	2124

ప్రశ్నిస్తే అరెస్టులా ?

కడ్తాల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి లంబాడాలపై కక్షగట్టారని ఎల్‌హెచ్‌పీఎస్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు హక్కుల కోసం ప్రశ్నించే వారి అరెస్టులు తప్పేలా లేవని అభిప్రాయపడ్డారు. సోమవారం గిరిజన సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చాయి. దశరథ్, గిరిజన నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా కడ్తాల పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. సాయంత్రం విడుదల చేశారు. దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు చేయక ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోందని మండిపడ్డారు. ప్రజల పక్షాన తాము పోరాటం కొనసాగిస్తామని అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో సుమన్‌నాయక్, రమేశ్ ఉన్నారు.



ఆలయంలో ఆశీర్వచనం తీసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

పరిగి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయస్వామిని సోమవారం పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డిని ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రైస్‌మిల్ మిషనరీ కొనుగోలుపై దుమారం

» ఫ్యాక్స్‌కు రిలీజ్ ఆర్డర్ ఇచ్చిన డీజీఎం

» చెక్కుపై సంతకం చేసి కాంట్రాక్టర్‌కు ఇచ్చిన చైర్మన్, కార్యదర్శి

» విచారణకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సొసైటీ సభ్యులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యాలాల మండలం ప్రాథమిక వ్యవసాయం పరపతి సంఘం గోదాం రైస్ మిల్ మిషనరీ కొనుగోలుకు రూ.54లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లింపుపై దుమారం రేపింది. ఆంధ్రజ్యోతిలో 'మిల్లు కట్టకున్న బిల్లు' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి సొసైటీ సభ్యులు స్పందించారు. సొసైటీ సభ్యులు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు సహకార సంఘంలో రైస్‌మిల్ నిర్మాణంలో అవినితి అక్రమాల్లో విచారణ జరిపి పీఈఎసీఎస్ చైర్మన్, సీఈవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ మూడు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని డీసీవోను ఆదేశించారు. ఇదిలా ఉండగా దీనిపై డీసీవో కూడా ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు అడిట్ చేసుకోని ఈ సొసైటీపై వెంటనే ఆడిట్ చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే కాంట్రాక్టర్‌కు సంబంధించిన కంపెనీకి అడ్వాన్స్‌గా నిధులు ఇవ్వాలని డీసీబీ డీజీఎం రిలీజ్ ఆర్డర్ వేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ ఆర్డర్ 2024 జులై 29వ తేదీన యాలాల ఫ్యాక్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే సొసైటీ మాత్రం చెక్కును చైర్మన్, సెక్రటరీ పీఏసీఎస్ యాలాల పేరిట నేరుగా కంపెనీకి కాకుండా కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. కాంట్రాక్టర్ అడ్వాన్స్ చెల్లింపు విషయంలో జిల్లా అధికారుల పాత్ర కూడా ఉండటం పలు విమర్శలకు దారితీస్తున్నది. అడ్వాన్స్‌లు చెల్లించి అధికారుల కమీషన్లు పొంది అక్రమాలకు పాల్పడ్డారని సొసైటీ రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మిల్ మిషనరీ కొనుగోలు కోసం రిలీజ్ ఆర్డర్లు మంజూరు లెటర్‌ను 2022 డిసెంబరులో హెచ్‌డీసీసీబీ బ్యాంకు లేటర్ పీఏసీఎస్ యాలాలకు ఇచ్చింది. అయితే చెక్కు రిలీజ్ తర్వాత సొసైటీ సభ్యులతో తీర్మానం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



నిరసన తెలుపుతున్న భూ నిర్వాసితులు

అలైన్‌మెంట్ మార్చాలని అర్ధనగ్న ప్రదర్శన

» హైవేపై భూ నిర్వాసితుల నిరసన

కడ్తాల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పంట పొలాల మీదుగా ఏర్పాటు చేసే 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ కడ్తాల మండల కేంద్రంలో భూ నిర్వాసితులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. అలైన్‌మెంట్‌ను మార్చాలని 15 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలశీతలీకరణ కేంద్రం ఎదుట రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శనచేశారు. ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని భూనిర్వాసితులు స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండ పంట పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ ఎలా ఏర్పాటు చేస్తారని మండిపడ్డారు. కడ్తాలలో భూ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. హైటెన్షన్ లైన్, ట్రిపుల్‌ఆర్ పేరుతో పేద రైతుల భూములు లాక్కోవద్దని కోరారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు,నాయకులు కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, రాములు, నర్సింహ్మ, కృష్ణ, శ్రీరాములు గౌడ్, యాదయ్య, మహేశ్, రవి, సురేశ్,రాఘవేందర్, అబ్బు రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

చేవెళ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం అని మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. సోమవారం కిష్టాపూర్‌లో రూ.5లక్షలతో వేసే సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు దశలవారీగా నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో కేంద్ర నిధులు తెచ్చి పనులు చేయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్, అనంతరెడ్డి, నాయకులు అమరేందగౌడ్, ఆంజనేయులుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శర్వలింగం, ఉమాశంకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లారి వైభవ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణాగౌడ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, విష్ణువర్ధన్ రెడ్డి, సత్తయ్య, మహేందర్, జైపాల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

మాతా శిశు ఆస్పత్రిలో నిండు గర్భిణి మృతి

» వైద్యుల నిర్లక్ష్యం కారణమంటూ బంధువుల ఆందోళన

» డ్యూటీ డాక్టర్‌ను విధుల నుంచి తొలగించిన అధికారులు



మృతురాలు అఖిల(ఫైల్)

తాండూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం తాండూరు మాతా శిశు ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణి మృతి చెందింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం రావుల్‌పల్లికి చెందిన అఖిల(23)కు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు తాండూరు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. సోమవారం తెల్లవారుజామున కడుపులో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే అఖిల మృతి చెందింది. వైద్యులు పట్టించుకోకపోవడం వల్లే అఖిల మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. యాలాల పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. డ్యూటీ డాక్టర్ మంజుల వైద్యం అందించలేదని తమ దృష్టికి వచ్చిందని, ఆమెను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ కోసం ఓ కమిటీ వేశామని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట

» చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం పేదలకు ఊరటనిచ్చిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కంటే ముందు చిదంబరం జీఎస్టీని తెచ్చేందుకు ప్రయత్నించారని, కానీ వారి వల్ల కాలేదన్నారు. 17రకాల పన్నులను ఒకే జీఎస్టీలోకి మోదీ ప్రభుత్వం తీసుకొచ్చి ఎంతో తగ్గించిందన్నారు. ఇప్పుడు గతంలో అధిక పన్నుల భారంతో వ్యాపారులు జీఎస్టీ ఎగ్గొట్టేవారని, ఇప్పుడు రేట్లు తగ్గడంతో తప్పనిసరిగా చెల్లించే పరిస్థితి ఏర్పడిందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులపై భారం తగ్గిందని, రాష్ట్రాలకు ఆదాయం తగ్గినా కొనుగోళ్లు పెరిగి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ నిర్ణయం ప్రజల్లో సానుకూల వాతావరణం సృష్టించిందన్నారు. కొన్ని శక్తులు కులం, జాతి పేరుతో విభజన సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. వికారాబాద్‌కు ఎంఎంటీఎస్, వందే భారత్ రైలు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ జిల్లా కన్వీనర్ ఈశ్వరప్ప, వికారాబాద్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్లనందు, బీజేపీ రాష్ట్ర నాయకులు శివరాజ్, పాండుగౌడ్, శివరాజ్, పోకల సతీష్, వివేకానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అవమానం

జీఎస్టీ తగ్గింపుపై వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర అవమానం జరిగింది. ఎంపీ స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించగా జిల్లా అధ్యక్షుడు ఆలస్యంగా రావడంతో డోర్ బయటే నిలబడి పోయాడు. సమావేశం అనంతరం కూడా ఎంపీని కలిసేందుకు జిల్లా అధ్యక్షుడు ప్రయత్నించినప్పటికీ ఆయన పట్టించుకోకుండా వెళ్లిపోవడం గమనార్హం.

సీఎం, స్పీకర్ సొంత జిల్లాలో ఇదేనా అభివృద్ధి?



రోడ్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్

వికారాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం, స్పీకర్ సొంత జిల్లాలో ఇదేనా అభివృద్ధి అని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ విమర్శించారు. వికారాబాద్ పట్టణంలో సోమవారం గుంతల రోడ్లను బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ రోడ్లు గుంతల మయంగా మారి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రముఖ న్యాయవాది సైతం ప్రాణాలు విడిచారని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపుతామనంటున్నారే కానీ సమస్యలు, పరిపాలనపై దృష్టి సారించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.94కోట్లతో బ్రిడ్జి తీసుకొస్తే ఆపనులనూ ముందుకు సాగనివ్వడంలేదన్నారు. గతంలో మున్సిపాలిటీకి వచ్చిన నిధులనూ నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు రోడ్లు బాగుచేసే ఉద్దేశం లేదన్నారు. వికారాబాద్ ప్రాంతానికి పిల్లనివ్వడానికి కూడా భయపడే విధంగా ఈ రోడ్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మేక చంద్రశేఖర్‌రెడ్డి, గయాజ్, సుభాన్ రెడ్డి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ అరవింద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని కొత్తూర్ గ్రామంలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బుగ్గప్ప, వెంకటయ్య, బుస్స చంద్రయ్య, గోవింద్‌నాయక్, కొత్తూర్ చంద్రయ్య, లక్ష్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆమనగల్లు కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు


చేవెళ్లలో దుర్గామాతకు పూజలు


మహేశ్వరం: అమీర్‌పేటలో పూజల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి


కేశంపేట మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు

- ఘనంగా మొదలైన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో అమ్మవారి అలంకరణ


కొత్తూర్‌లో జై భవానీ సేవా సమితి ఏర్పాటు చేసిన దుర్గామాత


షాబాద్: ముద్దెంగూడలో దుర్గామాతకు స్వాముల పూజలు

ఆమనగల్లు/కేశంపేట/ఇబ్రహీంపట్నం/షాబాద్/కందుకూరు/చేవెళ్ల/కొత్తూర్/మహేశ్వరం/కొందుర్గు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో దుర్గామాత విగ్రహాలను నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. విజయదశమి వరకు అమ్మవారిని రోజుకో అలంకారంలో పూజిస్తారు. మొదటి రోజు బాలాత్రిపుర సుందరీదేవిగా కొలిచారు. ఆమనగల్లు కన్యకాపరమేశ్వరి ఆలయంలో కమిటీ అధ్యక్షులు వీరబొమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, గణపతి, అభిషేకం, ధ్వజారోహణ, దీపారాధన, కలశ పూజలు చేశారు. హోమంలో రామ్మోహన్‌మాధవి, బికుమాండ్ల రమేశ్‌వాసవి దంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, బి.నర్సింహ, శ్రీనివాస్, శ్రీను, లక్ష్మయ్య, పాండయ్య, చంద్రశేఖర్, విష్ణువర్ధన్, సుమణ్, తేజ, నాగరాజు, నటరాజ్ యాదయ్య పాల్గొన్నారు. ఆమనగల్లు కట్ట మైసమ్మ ఆలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. హోమంలో రూపం వెంకట్‌రెడ్డిసుజాత, వెంకటయ్యబాలమణి దంపతులు పాల్గొన్నారు. మార్కండేయాలయంలో పూజారి విష్ణుయ్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎంగళి బాలకృష్ణ, అవ్వారి శివలింగం, సత్యరాములు, దుర్గయ్య, అప్పం శ్రీను, అశోక్, యాదగిరి, అంజనేయులు, అప్పి, శ్రీధర్, పాండు, రవీందర్, రవి, మహేశ్, పాండు, మన్న ఆనంద్, ఏలె నిరంజన్ పాల్గొన్నా రు. కేశంపేట మండలంలో దుర్గామాత మండపాల వద్ద పూజలు కొనసాగాయి. ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎల్లమోని గోపాల్‌యాదవ్, జంగయ్య దంపతులు పూజలు చేయించారు. ఇబ్రహీంపట్నంలోని ఈశ్వరాంజనేయస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవీ అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. షాబాద్, ముద్దెంగూడ, కేశవగూడ, కుమ్మరిగూడ, మల్లారెడ్డిగూడ, హైతాబాద్, తాళ్లపల్లి, సర్దార్‌నగర్, బొబ్బిలిగామల్లో అమ్మవారి మండపాల్లో పూజలు నిర్వహించారు. కందుకూరు, కొత్తగూడ, అగర్‌మియాగూడ, దాసర్లపల్లి, నేదునూరు, రాచులూరు, లేమూరు, పులిమామిడి గ్రామాల్లో మండపాలను తీర్చిదిద్దారు. అగర్‌మియాగూడలో మండప కమిటీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, టింకు, అరవింద్‌రెడ్డి పూజలు నిర్వహించారు. చేవెళ్లలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి జై భవానీమాత ఉత్సవ కమిటీ సభ్యుల పూజలను ప్రారంభించారు. కొనగట్టు ఆలయంలో భ్రమరాంబ అమ్మవారికి, బ్రహ్మగిరి క్షేత్రంలో పూజలు చేశారు. లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. మల్కాపూర్, తంగడ్‌పల్లి, పామెన, కందవాడ, కమ్మెట, కేసారం, పలుగుట్ట, గుండాల, ఎన్కెపల్లి, ఆలూర్ గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేశారు. కొత్తూర్ మున్సిపాలిటీ, గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో పూజించారు. మహేశ్వరం, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమీర్‌పేట దుర్గామాత ఆలయాన్ని ఎమ్మెల్యే సబితారెడ్డి దర్శించుకున్నారు. కొందుర్గు, ముట్పూర్ గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేశారు. దుర్గామాత మాలాధారులు ఉపవాస దీక్షలతో మొదటి పూజలు చేశారు.


కందుకూరు: అగర్‌మియాగూడ దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఆమనగల్లు కన్యకాపరమేశ్వరీ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు


కొందుర్గు: ముట్పూర్‌లో అమ్మవారికి పూజలు

దుర్గాదేవికి మధుసూదన్‌రెడ్డి దంపతుల పూజలు


నెర్రెపల్లిలో దుర్గాదేవి పూజల్లో చిలక మధుసూదన్‌రెడ్డి దంపతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా మండల పరిధి నెర్రెపల్లిలో సోమవారం డ్రీమ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి-లాస్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృప ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవీ అవతారంలో పూజించారు.

బతుకమ్మ చీరల పంపిణీ అభినందనీయం


మహిళలకు చీరలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):గ్రామీణ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం అభినందనీయమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొండారెడ్డిపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్‌గౌడ్ తన డబ్బుతో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యాక్రమానికి హాజరైన అంజయ్య మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ మహిళకు బతుకమ్మ చీర అందజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రేమ్‌కుమార్ తన గ్రామం మహిళలకు చీరలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి,జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్‌రావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు తలసాని వెంకట్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, నవీన్‌కుమార్, ఆంజనేయులు, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్, వాజిద్, జమాల్, జగదీశ్వర్‌గౌడ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు హర్షణీయం



చేవెళ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):దసరా సందర్భంగా దేశంలోని మహిళలకు ఉచితంగా 25లక్షల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం హర్షణీయమని బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... పండుగ కానుకగా 25లక్షల ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇవ్వనున్నారని కేంద్ర మంత్రి హర్‌ప్రీత్‌సింగ్ ప్రకటించడం సంతోషకరమన్నారు.

చెక్ డ్యాం కూల్చివేతపై ఫిర్యాదు

ఆదిభట్ల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):కొంగరకలాన్(ఫిరోజ్‌గూడ)లో చెక్ డ్యాం కూల్చిన రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో సోమవారం మహేశ్వర్ ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 11లో నిర్మించిన చెక్ డ్యాంను రాత్రిరాత్రికి కూల్చి స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. చెరకు కాల్వలను సైతం ఆక్రమించారని ఫిర్యాదులో తెలిపారు.

క్రైం కార్నర్

రైల్లో నుంచి పడి వ్యక్తి దుర్మరణం

కొత్తూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలునుంచి పడి బద్రిప్రసాద్ నాందేవ్(44) అనే వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలోని పుణె జిల్లా నాగర్ గ్రామానికి చెందిన బద్రిప్రసాద్ కర్నాటక నుంచి మహారాష్ట్రకు వెళ్తూ రైలు నుంచి జారిపడి, తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌మాస్టర్ ఉబెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

బైక్ దొంగల రిమాండ్


బైక్ చోరీలకు పాల్పడిన నిందితులను చూపుతున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):బైక్ చోరీలకు పాల్పడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 19న పాలమాకులకు చెందిన సారా రాకేశ్, కాచారానికి చెందిన రాజు అనే వ్యక్తులు తమ ఇళ్ల ముందు పార్క్ చేసిన బైక్‌లు ఎత్తుకపోయారని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసుల దర్యాప్తు చేసి హైదరాబాద్‌లోని మియాపూర్‌నకు చెందిన ఇద్దరు నిందితులు సంతోష్‌దాస్, రాఘవేంద్ర, కాచారానికి చెందిన మైలారం శివకుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా అపహరించిన రెండు బైక్‌లు, వేరే పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీచేసిన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌దాస్, రాఘవేంద్ర, శివకుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై నరసింహనాయక్, సిబ్బంది విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌రెడ్డిలను ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌లు అభినందించారు.

ఎమ్మెల్యేపై అసభ్యకరంగా యానిమేషన్ వీడియో చేసిన వ్యక్తిపై కేసు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న విజయ్, సురేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై అసభ్యకరంగా వీడియో క్రియేట్ చేసి వాట్సప్‌లో పోస్టు చేసిన విజేశ్‌నాయక్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ సోమవారం తెలిపారు. వెల్దండ మండలం మర్రిగుంత తండాకు చెందిన విస్లావత్ విజేశ్‌నాయక్.. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మనోభావాలను దెబ్బతీసేలా, అసభ్యకరంగా ఓ యానిమేషన్ వీడియోను 'తలకొండపల్లి చర్చా వేదిక' అనే వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశాడన్నారు. దీంతో మేడిగడ్డ తండాకు చెందిన ఎమ్మెల్యే అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు విజయ్‌రాథోడ్, సురేశ్ తదితరుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

కొందుర్గు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గంగన్నగూడ నుంచి ఎదిర వరకు నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు కొందుర్గు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తమ నాయకులు చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేయాలని ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, సత్యప్రమోద్‌రావు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, యాదిరెడ్డి ఫిర్యాదు చేశారు.

120 మందికి వైద్య పరీక్షలు

కడ్తాల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మైసిగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం స్వాస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. మధుమేహ, క్యాన్సర్, టీబీ, దంత, కంటి, మాతా శిశు సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, జహంగీర్ అలీ, వేణుగోపాల్, వైద్య సిబ్బంది రామచంద్రయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లమ్మ, పుష్పవతి, రమాదేవి, లక్ష్మీదేవి, జ్యోతిలక్ష్మి, కవిత, అరుణమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కార్మికులకు దుస్తులు, గ్రాస్ కట్టర్లు పంపిణీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధి పోచారం, ఎలిమినేడు, తులేకలాన్, కప్పాడు, తుర్కగూడ, చెర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు సోమవారం దుస్తులలు, గ్రాస్ కట్టర్లు పంపిణీ చేశారు. యేటా దసరా సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు ఆయన దుస్తులు పంపిణీ చేస్తూ వస్తున్నారు.


గ్రాస్ కట్టర్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ బి.రామ్‌రెడ్డి

పీపీని సత్కరించిన మాజీ జెడ్పీటీసీ

కేశంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సబియా సుల్తానాను సోమవారం కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి సన్మానించారు. సబియా సుల్తానా కార్యాలయానికి వెళ్లి మెమొంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. పూలమాలలు వేసి అభినందిచారు. సామాన్యులకు న్యాయం అందేలా కృషి చేయాలని కోరారు. చాలా మంది చట్టాల గురించి తెలియక తప్పులు చేస్తున్నారని, ప్రజలకు చట్టాలపై వివరించాలని సూచించారు. మహిళల చట్టాల గురించి వివరించాలని కోరారు.

దంచికొట్టిన వాన

(ఐదో పేజీ తరువాయి)

వద్ద 84.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మహేశ్వరం మండలం ఇండస్ట్రియల్ ఏరియాలో 83.5మిల్లీ మీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ వద్ద 75.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హయత్‌నగర్‌లో 63.5 మిల్లీ మీటర్లు, మహేశ్వరంలో 45.5 మిల్లీ మీటర్లు, మాడ్గులలో 59 మిల్లీ మీటర్లు, ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ కలెక్టరేట్ వద్ద 38 మిల్లీ మీటర్లు, సరూర్‌నగర్ మండలం అలకపురి కమ్యూనిటీ హాల్ వద్ద 31 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులో 29.8మిల్లీ మీటర్లు, మంచాల మండలం ఆరుట్లలో 25మిల్లీ మీటర్లు, ఇబ్రహీంపట్నం మండలం వైట్‌గోల్డ్ సమీపంలో 63.5మిల్లీ మీటర్లు, కందుకూరు మండలం రాచులూరులో 32.8మిల్లీ మీటర్లు, నందిగామ మండలప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 42.3 ఎంఎం ఎలిమినేడులో 41.3ఎంఎం, కందుకూరు మండలం మీర్‌పేట్‌లో 24.5 ఎంఎం, యాచారంలో 50మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆదిభట్లలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షంతో టీసీఎస్ రోడ్డు జలమయమై వాహనదారులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. షాద్‌నగర్‌లో సదరం సెంటర్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాగులు సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను సన్మానించారు. శంకర్ మాట్లాడుతూ.. ఏళ్ల తరపడి అపరిష్కృతంగా ఉన్న దివ్యాగుల సమస్యల ను పరిష్కరించేందుకు వికలాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, సంక్షేమ శాఖ అధికారి శైలజలతో త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తానని తెలిపారు. దివ్యాంగులకు ఎంత చేసినా తక్కువేనని, గత ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. భుజంగరెడ్డి మాట్లాడుతూ.. అలీంకో సంస్థ దివ్యాంగులకు ఉపకరణాలిస్తామని రెండు నెలల క్రితం దరఖాస్తులు తీసుకొని నేటికీ ఇవ్వలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

క్రీడల అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం

క్రీడల కోసం ఎంతైనా ఖర్చుచేస్తామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. షాద్‌నగర్ మినీ స్టేడియంలో శంకరన్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. ఎంతో మంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి మంచి శిక్షణ అందించాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు కొందుర్గు మండలంలో రూ.10కోట్లతో స్టేడియాన్ని నిర్మిస్తామని తెలిపారు. షాద్‌నగర్ స్టేడియాన్ని సైతం మరింత మోడిఫై చేసి క్రీడాకారులతో శిక్షణ ఇప్పించేందుకు కృషిచేస్తానని చెప్పారు. ఇప్పటికే క్రికెట్ క్రీడలో రాణిస్తున్న క్రీడాకారులకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)తో చర్చించి నాణ్యమైన శిక్షణిచ్చేలా ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి విశ్వం, బస్వమప్ప, ముబారక్, క్రీడాకారులు ఖదీర్, ఖలీల్ పాల్గొన్నారు.

పట్టాలు పొందిన వారికి పొజిషన్ చూపాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):రామోజీ ఫిలిం సిటీ వద్ద నాగన్‌పల్లి సర్వే నంబర్ 203లో ఇళ్ల పట్టాలు పొందిన వారికి వెంటనే పొజిషన్ చూపాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రమందజేశారు. తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పరిస్థితి వివరించారు. నాగన్‌పల్లి, పోల్కంపల్లి రాయపోల్, ముకునూరు గ్రామాలకు చెందిన 650మందకి 2007లో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపలేదని అన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కావలి నర్సింహ, మండల కార్యదర్శి సురేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద యూరియా కోసం సోమవారం రైతులు బారులుతీరారు. ఉదయం నుంచే వందలాది మంది రైతులు వచ్చి లైన్‌లో నిల్చున్నారు. యూరియా కోసం పురుషులతో పాటు మహిళలు సైతం భారీ సంఖ్యలో వచ్చారు. సింగిల్ విండోకు వచ్చిన 900 యూరియా బస్తాలను పంపిణీ చేసేందుకు సిబ్బంది ప్రయత్నించగా రైతులు ఒక్కసారిగా తోసుకురావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దాంతో పోలీసులు జోక్యం చేసుకుని రైతులను అదుపుచేశారు. పోలీసులు, ఏవో నిశాంత్‌కుమార్, విండో చైర్మన్ బక్కన్న, సిబ్బంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున ఇచ్చారు. అయినా యూరియా లభించలేదని చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వెనుతిరిగారు.


షాద్‌నగర్ సొసైటీ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

సంక్షిప్తంగా...

- **మాడ్గుల:** మండల రైతులకు సరిపడా యూరియా ప్రస్తుతం అందుబాటులో లేకున్నా రానున్న కొన్ని రోజుల్లోనే అందరికీ యూరియా అందజేస్తామని ఏవో అరుణకుమారి సోమవారం తెలిపారు. ఇప్పటికే ప్యాక్స్‌ల ద్వారా 40 టన్నులు, అగ్రోస్ సెంటర్లలో 20 టన్నుల యూరియా పంపిణీ చేశామని చెప్పారు. త్వరలో సొసైటీకి 25 టన్నులు, మన గ్రోమోర్ కేంద్రానికి 25టన్నుల యూరియా రానుందని, అందరికీ అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.
- **ఆమనగల్లు:** పోలెపల్లికి చెందిన సిరగని లాలయ్య ఇంటి నిర్మాణానికి తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం నిలిచిపోయిన విషయాన్ని మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్, పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ దోనాదుల సత్యం ఆయన దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణ మెటీరియల్‌ను సమకూర్చి లాలయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, వెంకటయ్యగౌడ్, తిరుపతయ్యగౌడ్, శేఖర్, బాలకిష్టయ్య, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.
- **కడ్తాల్:** చరికొండకు చెందిన నరసింహ అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పాలకుర్ల మహేందర్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ రాములు పరామర్శించారు. బాధిత కుటుంబానికి మహేందర్ రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఈశ్వర్‌యాదవ్, అంజనేయులు, యాదయ్య, బాలకృష్ణ, రాముగౌడ్, మహేందర్, రాజీవ్, రమేశ్, సత్తయ్య, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.
- **తలకొండపల్లి:** గట్టిప్పలపల్లికి చెందిన మహ్మద్ అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్ పరామర్శించారు.ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 3వేలు సమకూర్చగా ట్రస్ట్ సభ్యుడు అశోక్‌గౌడ్ అందజేశారు. నాయకులు రాజశేఖర్, రాములు, ఆంజనేయులు, చంద్రశేఖర్, హైమద్, సమ్మద్, దాసు, ఉన్నారు. వెల్జాలకు చెందిన పులిజాల శ్రీను అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించి రూ.3వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో శ్రీకాంత్ యాదవ్, పెంటయ్య, సుల్తాన్, జగన్, శ్రీశైలం, బాల్‌చెన్నయ్య, బాలస్వామి, మైసయ్య తదితరులు ఉన్నారు.
- **ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ బీసీ కాలనీకి చెందిన కోరే లింగప్పకు కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.32వేలు మంజూరయ్యాయి. అతడి కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు బాబా చెక్కును అందజేశారు.
- **చౌదరిగూడ:** మండల పరిధి తుమ్మలపల్లిలో దసరా పండగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన సనా సలీం, అర్షద్‌లు సొంత డబ్బుతో విద్యుత్ బల్బులను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో బాలయ్య, శ్రీధర్, కృష్ణయ్య, జంగయ్య, పాల్గొన్నారు.
- **కందుకూరు:** సహకార సంఘం రైతుల సంక్షేమానికి పాటుపడుతుందని, రైతులు తీసుకున్న రుణాలను చెల్లించాలని సొసైటీ చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి కోరారు. రైతులకు మంజూరైన ఎల్టీ రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డైరక్టరు పాండురంగారెడ్డి, సిబ్బంది మహేశ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.
- **శంకర్‌పల్లి:** రైతులు పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యురాలు ఎల్.మానసరెడ్డి అన్నారు. కొత్తగూడలో సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పునరుత్పత్తి పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 27 ఆవులకు, 21గేదెలకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. 42దూడలకు, 45మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామన్న, రాజ్యలక్ష్మి, భరత్ ఉన్నారు.
- **షాబాద్:** గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్యఅన్నారు. ముద్దెంగూడలో రూ.60వేల సొంత డబ్బుతో రెండు బోరుమోటర్లను బిగించి కలిసి ప్రారంభించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మసుదర్శన్, పంచాయితీ కార్యదర్శి శోభ, గ్రామస్తులు పాపిరెడ్డి, శంకర్, శ్రీను, ప్రభాకర్, సాయికృష్ణారెడ్డి, సుధాకర్,చంద్రయ్య, శేఖర్, పాండు, రాజు, అంజిరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.
- **కందుకూరు:** గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్ అన్నారు. కొత్తగూడ పంచాయతీలో యూజీడీ పనులకు రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆ పనులను వారు ప్రారంభించారు.